

ఉద్యోగము

కందుకూరి లింగరాజు

దివాన్ బహదూర్ నరసింగనాయనింగారు చదువుకుంటున్న పుస్తకం పైకెత్తి, ఓసారి కిటికీవైపు చెవియొగ్గేరు; ఏదోచప్పుడు గలాటాలా వినిపిస్తుంటే. ఎవరో మేడమెట్లు ఎక్కుతున్నారు; అడుగుల చప్పుడు సుబ్బన్నని చెపుతూనే వుంది. దుఃఖం, భయం కలిసిన ముఖంతో లోపలికి వస్తూ—

'బాబుగారూ!' అన్నాడు సుబ్బన్న.

'అంత తొందర, అల్లరి చేస్తూ రాకపోతే ఏం పుట్టి మునిగింది' ఉరిమేడు నరసింగనాయని.

'మన కుక్క జానీని రాజుగారు కాల్చి చంపేసేరండి.'

'కాల్చే?' గంతేసినట్టు లేచేడు. ముఖం ఎర్రబడింది. 'కాల్చిచంపేరా? ఏం, ఎక్కడ వుంది?'

'దెబ్బతో చచ్చిపోయిందండి' సుబ్బన్న తడబడ్డాడు. ఆ మాటల్లో ద్వేషం ఉన్నా, పైకే భావం ఆగలేదు. 'జానీని మన చివరి పొలం గట్టున చూచేనండి, రాజావారు పక్షుల వేటకని బయలుదేరేరు. రెండుమూడుసార్లు తుపాకీ గుళ్ల శబ్దం కూడా విన్నాను.'

పళ్ళు కొరుక్కున్నాడు నాయని. ప్రియంగా నాల్గుసంవత్సరాలనుండి జానీని పెంచేడు. దాని మృతి దుఃఖం కల్గించి, కళ్ళకు నీళ్ళు చిమ్మేయి; క్షణికం. 'చంపేడూ...దీనికి వాణ్ణే చంపేస్తా' జోళ్ళలో కాళ్లుపెట్టి మెట్లవైపు నడిచేడు నాయని.

'దెబ్బతీసి తీరాలండి.'

'జానీ ఎక్కడవుంది సుబ్బన్నా?'

'చివరి పొలంగట్టున ... ఈపాటికి చచ్చే వుంటుందండి, పాపం జానీ...'

సుబ్బన్నకి తెలుసు. తన యజమానికి జానీ అంటే ఎంత ప్రేమో. ఆ నల్లరంగు జూలులో, ముఖంమీద తెల్లమచ్చతో ఎంత అందంగా, హుషారుగా ఉండేదో. యజమానికి ఆక్షణంలో జానీ వెనుకటి మంచిరోజులన్నీ జ్ఞాపకం వస్తున్నాయని పూర్తిచెయ్యకుండా ఆగిపోయేడు.

'సుబ్బన్నా! నా తుపాకి తెచ్చిపెట్టు' నెమ్మదిగా నాయని అన్నాడు. సుబ్బన్న ఉలిక్కిపడ్డాడు. (అయినా ఆయనముఖంలో వున్న నిశ్చయత, బాధ చూస్తుంటే ఏంచేస్తాడో తెలిసి భయపడ్డాడు.

'తుపాకి?'

'ఊ...తుపాకీ అని చెప్పలేదూ' సుబ్బన్న నిలుచునే ఉన్నాడు; సందిగ్ధంలో. నాయని మాట్లాడకనే, లోపలికి వెళ్ళి తుపాకీ స్వయంగా తెచ్చుకుని మెట్లు దిగేడు.

సుబ్బన్న ఖంగారు పడ్డాడు. 'ప్రభువు వారు, తుపాకీ ఎందుకండి? తమ చేతి బెత్తాం తీసుకు వస్తా, కుక్కనికొట్టినట్లుకొట్టి పరాభవం చేయించండి, తుపాకీ ఎందుకు.'

నాయని వినే లేదు.

'జానీని కాల్చేడు. దానికి ప్రతిఫలం ఇప్పుడు పుచ్చుకుంటాడు. రాజా ఎక్కడ వున్నాడు? కాలవగట్టునే ఉంటాడా?'

సమాధానం వినకుండానే నాయని వెళ్ళిపోయేడు. సుబ్బన్న భయంతో వణకిపోయి మెట్లమీదనే చతికిలబడ్డాడు. దూరంగా కంది చేల్లోనుండి యజమాని బూట్సుల చప్పుడు వినిపించింది. ఆయన కాలవగట్టుకు వెళ్ళినట్టు అనింది. అక్కడే చివరి పొలంవుంది; అదే రాజాగారి ఎస్టేటుకు, తమ పొలంకు సరిహద్దు. తను లేచి వెళ్ళి రాజాగారితో వచ్చే ఆపదని గురించి చెప్పదామనుకున్నాడు. దాంతో ఆయనను, తన యజమానినికూడా రక్షించినవాడు అవుతాడనుకున్నాడు...అయినా అది చేతులు దాటినట్టే వున్న....

ఆ చేలగట్టునపడి, కాలవచేరుకుని పైకి క్రిందకీ చూచి వచ్చేసరికి అరగంట అయ్యింది. దాంతో ఏ ఉద్వేగంతో నాయని బయల్దేరేడో, అది చాలవరకూ తగ్గింది. తగ్గినా తన కుక్కని చంపినందుకు ప్రతీకారం తీర్చుకోవాలన్న నిశ్చయం సడలలేదు.

అరగంటకు ముందుగా రాజావారు కనిపించి వుంటే, తుపాకీతో కాల్చేసి వుండును. అది నాయనికి తెలుసు. దాంతో, అకాలంగా ఉద్భవించే ఉద్వేగాలను తను ఎల్లా చంపుకో లేకుండా బానిస అయివుండేవాడో! అసలు జీవితంలో, ఇటువంటి ఉద్వేగాలు ఎలాగ క్రూరతరంగా పరిణమించేవో కూడా గుర్తుకు వచ్చింది.

మొన్నటి యుద్ధంలోకి వెళ్ళినపుడు, నిరంతరంగా వినపడే తుపాకీ మోతలు, చావులు ఆక్రందనాలు మర్చిపోలేదు. వాటి పరిణామం నరాలమీద పడ లేదు. యుద్ధంలో బిరుదులు పొంది, ఉద్యోగస్థాయిదాల్లో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా ఉండే నియమాలుఉన్నా, కొన్నిక్షణాలు తన ఉద్వేగాలు అదుపాజ్ఞల్లో ఉండకుండానే ఉంటున్నాయి.

చివర పొలంగట్టున జానీని చూచేడు. రక్తం మడుగులో,దీనంగా అరచి చచ్చిపడివుంది.కొన్ని గంటలక్రితం, జీవంతో వున్నది. ఇప్పుడు నిశ్చేష్టంగా కట్టెలా ఉంది. జానీని జీవితంలో ఎక్కువగా ప్రేమించేడు. ప్రియంగా, సాత్వీకంగా ఉన్న దానిజీవితం అంతంఅయి, తన జీవితంలోని ఓసుఖం దొంగిలింపబడింది; క్రూరంగా వేరు చేయబడింది.

రాజావారి ఆ మొద్దు ముఖం; ఆ ఏనుగంత మనిషినీ ద్వేషించేటట్టు చేసేది. ఇంకా ఏం చేయించేదో! కాని ఆయన ఈ పొలిమేరలు వదలడంతో బ్రతికిపోయాడు అనుకున్నాడు. క్షణకాలం రాజాకూడా చేసిన పనికి పశ్చాత్తాప పడే వుంటాడనుకున్నాడు.

తిరగడంలో, రాజా మేడదగ్గరకి వచ్చాడు. ఓ వందగజాల దూరంలో, ఆకుపచ్చ రంగుతో అది క్రూరంగా నుంచుని, పండిన పంటల్ని కైమా చేస్తానన్నట్టు వుంది. నాయనికి అక్కడికి వెళ్ళి, ముఖాముఖి మాట్లాడుదామా అన్న కోర్కె కలిగింది. అది నిర్ణయం కావడంలేదు. వెళితే, పీటితో ఏవో కొన్ని మాటలు, తర్వాత కొట్టుకోవడం, సమాప్తి అవుతుందని తెలుసు. అది ఏవిధంగా ఉపాయకారో తెలియటం లేదు. రాజా ఏ విధంగా తన్ని గాయపరచాడో, అతన్ని అల్లాగే గాయపరచాలి. అతను బాధపడుతూ, నరకంలో జీవితాంతం మరచిపోకుండా ఉండేటట్లు చెయ్యాలి.

వెనక్కు తిరిగేడు; ద్వేషం, జుగుప్స కలిగాయి. ఇదివరకు జానీ వచ్చి, కోళ్ళని, బాతుల్ని, అల్లరి చేస్తోందని రాజా చెప్పేడు. తాను పట్టించుకో లేదు. చిన్న చిన్న వాటికోరకు, జానీనే చంపేటంతగా తయారయ్యే ఆ మనిషి ప్రవృత్తి అర్థం కావటం లేదు. విజ్ఞానం తెలియని జంతువుని చంపడంలోఉన్నమూర్ఖతత్వం, అనూహ్యంగా ఉంది. జీవహింస చేసేవాళ్ళమీద ప్రభుత్వం ఏ విధమైన ఆంక్ష ఉంచలేదు కాబోలు. జంతువుల్ని క్రూరంగా గొలుసుల్తో కట్టి, హింసించి, వాటి స్వాతంత్ర్యాన్ని అరికట్టడం ఎంత నీచమో వాళ్ళు ఊహించరు కాబోలు అనుకున్నాడు.

తన పొలాల్లోకి వచ్చేటప్పటికి సుబ్బన్న ఎదురు పడ్డాడు. యజమాని ముఖంలో ఏమైనా చూడగలనేమో అనుకున్నాడు; కాని నిరాశ చెందాడు.

'రాజా కన్పించనే లేదు' నెమ్మదిగా అన్నాడు నాయని. సుబ్బన్న తేలికపడి, నిట్టూర్పు విడిచాడు. యజమానిలో ఉద్వేగం తగ్గినందుకు వెంకటేశ్వరుడికి దణ్ణం పెట్టుకుని సంతోషించేడు.

'వాడు పట్టి మూర్ఖుడండి, పిరికిపంద.'

నవ్వాడు నాయని...

సంధ్య చీకట్లలో పొలాల గట్టున నడచి, ఇల్లు చేరాడు.

'వెర్రి కోపంలో, మనుష్యులకు ఒళ్లే తెలియదండి. వాడికి ఇప్పుడు తెలిసి పశ్చాత్తాప పడుతూ వుంటాడండి. వాడి బ్రతుకే అంత...అల్లా జీవిస్తాడు.'

'వాడి దృష్టిలో జానీ: బ్రతకడం మంచిది కాదు కాబోలు'

ఇద్దరూ మౌనంగా అడుగులు వేసేరు చేలల్లోంచి.

ఆ రాత్రి నాయని ఆరుబయటే కూర్చుని, వచ్చి పోయ్యే చిన్న చిన్న మబ్బుల్ని, మిణుకు మనే నక్షత్రాల్నిచూస్తూ, తోటల్లోనుండి వచ్చే కీచురాయి శబ్దాన్నివింటూ వున్నాడు. సాధారణంగా రోజూ రాత్రి పది గంటలు కాక పూర్వమే నిద్రపోయేవాడు - ఈ రాత్రి పదకొండు దాటింది. నిద్ర రానట్టే వుంది.

రోజూ రాత్రిళ్ళల్లో జానీ పాదాలదగ్గరగా కూర్చుంటే దాని తల, ఒళ్ళు దువ్వి, ఒకటి రెండు సార్లు ముద్దెట్టుకునే వాడు. దాని పక్కా వరండాలో తన ప్రక్క వేయించే వాడు. ఈ రాత్రి సుబ్బన్న వెయ్యనేలేదు. రోజూ దాన్ని నిద్రపుచ్చే అలవాటు పోలేదు. అతని జీవితంలో సుఖంగా మిగిలిపోయింది ఈ ఒక్క జోలపాటే; అదికూడా విధి లాక్కుంది. జానీ ఇప్పుడు ఆ కాలువకు ప్రక్కగానే, జీవితాంత సమాధి కట్టుకుని ఉంది.

డాబా చివరకి లేచి వెళ్లేడు. ఒంపులు తిరిగి కాలువ నిశ్చింతగా ప్రవహిస్తోంది. తూర్పు దిక్కున వర్షం వచ్చేట్లుగా వుంది-నల్లమేఘాలు పరిగెడుతున్నై. వాటినిచూస్తుంటే ఇంత ప్రపంచంలో ఎంత భీకరమైన ఒంటరితనంలో తాను ఉన్నాడో అతనికి తట్టింది. మొట్టమొదటగా కొడుకు, తర్వాత భార్య, ఇప్పుడు జానీ వెళ్ళిపోయారు-నిర్దయగా.

రాజావారిని చాలాకాలంనుండి చూస్తూనే వున్నాడు. జమీన్దారీ ఫాయిదాలో చేసే దురాగతాలు, పైకి చెప్పే లేని కబుర్లు వారిని ద్వేషించేటట్టే చేసేయి. జ్ఞాపకం ఉన్నంతలో రాజా ఒక్కరికి సహాయం చేసినట్టు, హింసించకుండా వదలినట్టు వినలేదు. అప్పుడప్పుడు నౌకర్లు ఆయన తప్పత్రాగి పెళ్లాన్ని కొట్టేవాడని, అందుకే ఆవిడ ఒదిలి పారిపోయిందని వినే వాడు. కాని అంతవరకూ విన్నవి నిజమూ అన్నది కనుక్కోలేదు.

నిజంగా ఆలోచిస్తేరాజా ఇంట్లో ఎల్లావున్నా అది తనకు అక్కరలేని విషయమే. పెళ్ళాన్ని కొట్టడం, నౌకర్లని తిట్టడం - ఎవరి స్వగృహ విషయాలలో వారికి స్వాతంత్ర్యం ఉంది. ఇప్పుడో, నిజంగా రాజా చర్యలన్నీ కావలసి వచ్చాయ్:జానీనిచంపడంతో వాటితో అవసరం ఎక్కువ అయింది. ఇంకోవ్యక్తే జానీనిచంపి వుంటే ఈసరికి క్షమాపణ చెప్పుకునేవాడే. కాని రాజాకి మాత్రం అది చిట్టాలో లేని కాతా. కాతాలోకి వచ్చినా, మాట్లాడకుండా త్రాగి నిద్రపోతో వుంటాడు, ఇది భావనే.

రోజూ రాత్రి పుచ్చుకునేటట్టే, ఓల్డ్‌గాన్ బీర్ త్రాంగేందుకు దిగేడు. అలమారులోనుండి సీసా తీసి త్రాగేడు.వెనక్కు వస్తున్నపుడు టేబిల్ మీద ఉత్తరం కనుపించింది. సాధారణంగా ఎక్కడ పెడతారో అక్కడే అది వుంది. బహుశః ఏ నౌకరో తెచ్చి, ఈసమయంలో లేపటానికి భయపడి, అక్కడ పెట్టి వుంటాడు అనుకున్నాడు. కవరు తిరగవేసి చూచేడు. దానిమీద ముద్రగాని, బిళ్ళలుగాని లేనేలేవు. చింపేడు.

'శ్రీ నాయనింగారికి—

మీ జానీవచ్చి,నా కోళ్ళను, బాతుల్ని చెదర కొట్టి అల్లరిచెయ్యడం గురించి ఇదివరలో చాలా సార్లు మిమ్మల్ని హెచ్చరించాను. కాని మీరు విననేలేదు పైగా 'అంతగా ఉండలేకపోతే, నీ ఆస్తిని అమ్మేసి ఇంకోచోటికి లేచి పొమ్మని కబురు పంపేరు. ఇవ్వాళ మీ జానీ అల్లరి చేస్తుంటే నేను తుపాకీతో కాల్చేను. ఈ సందర్భంలో ఒక్కముక్క చెప్పాలి. మీకు ఇంకోకుక్కని తీసుకురావలన్న ఉద్దేశ్యమే ఉంటే, దాన్ని అదుపాజ్ఞల్లో పెట్టుకోవడం నేర్చుకోండి; లేనియెడల దానినికూడా నిర్దాక్షిణ్యంగా చంపడానికి నేను వెనుదీయను. పైగా ఓ తుపాకి పుచ్చుకుని నా కొరకు వెతకడం ప్రారంభించారటగా! అల్లాంటివార్త మరొకసారి నాకు తెలిసిందా- నేను పోలీసులకు రిపోర్టు చేయవలసి వుంటుంది.

గ్రహించవలెను

.........'

రాజావారిప్రవృత్తికి అనుగుణంగానే, కొంటె గీతల సంతకంతో ఆఖరు అయ్యింది. నాయనికి ఒళ్ళు సలసలా ఉడికింది. ఉత్తరాన్ని అక్కడే ఉంచి, డ్రాయరుతీసి, సాధారణంగా ఉపయోగించుకునే రివాల్వరు తీసి, జోళ్ళు వేసుకుని బయటకు వచ్చాడు.

కొద్దిక్షణాల్లో పొలాలకి అడ్డుపడ్డాడు. ఆతని ముఖం రక్తం కళ్లచూడాలనే పట్టుదల



తోనే బిగుసుకుపోయింది. దారిలో చెట్లను తప్పించుకుంటూ, రాజావారి మేడదగ్గరకు బయలుదేరేడు. కాలవగట్టుకు వచ్చేసరికి ఎత్తుగా ఉన్న జానీ గోరీ కన్పించింది. నాయని క్షణం ఆగి——

'జానీ! మళ్ళీ రాజా జీవితంలో ఇంకో కుక్కని కాల్చడు. దేవుడు రక్షించుగాక' నెమ్మదిగా అని, గట్టులు దాటేడు. అతనికళ్లకు ఆ కరడుకట్టిన పాషాణహృదయపు రాజాయే కన్పించేడు.

ఖూనీఅన్నది ఆక్షణంలో భావనలో చేసేడు- ఇక అది క్రియలో జరగాలి; అంతే!

*　　*　　*

నాయనిని అప్పుడప్పుడు ఆవరించే ఉద్వేగమే ఇప్పుడూ ఆవరించింది, నడిపించింది. ఇది వరకు కొంతకాలం ఉండి తర్వాత తగ్గిపోయేది. ఈ క్షణంలో అది చావకుండానే గమ్యస్థానం చేర్చింది. రహస్యంగా, నీడల్లో నడుస్తూ, రాజాఇంటివార నుంచుని, ఏకిటికీ తీసివుందా అని పైకి చూచాడు.

రాజావారి ఉత్తరం చదివినప్పటినుంచీ ప్రతీకారవాంఛ ఎక్కువ అయ్యింది. జీవహింస అన్నది రాజాకి వ్యసనమే అయ్యింది. అటువంటివాడిని రూపనామాలు లేకుండా అంతం చెయ్యడం తప్పులేదని తట్టింది. ఒక్క క్షమార్పణ కబురు నిజంగా ఆతన్ని రక్షించేదే. అలా కాకుండా ఉత్తరం తలతిక్కగా వ్రాయడంతో, మృత్యువుని పిలిచినట్టే అయ్యింది. నాయనికి తెలుసు, రాజా ఏగదిలో పడుకుంటాడో. ఇక చించుకునే నిశ్శబ్దంలో, రాజా తలలోకిగుండుని వదలడమే వుంది——

నాయనికి తెలుసు తను రాజాని ఖూనీ చేయబోతున్నాడని. అది నిర్ణయించుకొనే వచ్చాడు. దీనివల్ల, పోలీసులు, విచారణ, మృత్యుదండన, ఒకటితర్వాత ఒకటి తనను ఆవరిస్తాయి. ఈ నవ్య ప్రపంచపు సరళి చూస్తే నవ్వువచ్చింది. అదంతా ఓ మానవనిర్ణయం, దేవుని పేరుచెప్పి హక్కు పుచ్చుకున్నట్టుగా వుంది.

'జానీని చంపినందుకే! ఆతన్ని చంపి, బహుశః అతనికి తెలియకుండానే, ఆ కిటికీలోనుండి దిగి, పొలాల్లోంచే ఇంటికి వెళ్ళిపోవాలి. బూడ్సుల ఆనవాళ్ళు పడకుండా, కంకరదారిమీదవెళ్ళి, పిస్తోలు కాలవలో పడవేస్తే ఎవరూ అనుమానించరు...' కిటికీని తెరిచేడు. లోపల చూచేడు. నెమ్మదిగా లోపలప్రవేశించేడు. రాజా ఏగదిలో వుంటాడో, ఆ గదివైపే నడచేడు; పిస్తోలు చేతిలో పట్టుకుని. సావిట్లో వున్న దీపం తగ్గించేవుంది. ఎదురుగా తలుపులోనుంచి రాజా గది కనుపిస్తోంది. జోళ్లువిప్పేసి మూలకి నెట్టేడు.

గదిలోకి వెళ్లేడు. తోటవైపు వున్న కిటికీ బార్లావుంది. నెమ్మదిగా, అడుగుల్లో అడుగులువేస్తూ, పక్కదగ్గరగా వెళ్లేడు. బూర్నీసు కప్పిన ఆనవాలు ఎదురుగావుంది. తల ఎటువైపు వుందో, అన్న మీమాంసలో, నెమ్మదిగా, నెమ్మదిగా చెయ్యిపెట్టేడు. బూర్నీసు గుచ్చుకుంటోంది. 'ఓవేళ రాజా లేచినా, వెంటనే'

చేతిలో పిస్తోలు నుంచుంది....... అంగుళం, అంగుళం చెయ్యిజరిపేడు... చీకట్లో ... రాజా ఆకారాన్ని వెతుక్కుంటూ ... ... పక్క ఖాళీగా వుంది! ఆశ్చర్యపడ్డాడు. తనకేమీ తెలియటంలేదు.

గది చుట్టూరా తొందరగా చూచేడు. రాజా తను రావడంచూచి, ఏమూలైనా దాగున్నాడేమో అనుకున్నాడు.... ఒక్కొక్కటే, వ్రాసుకునే బల్ల,పుస్తకాల బీరువా, బట్టలపెట్టెలు, కోట్లస్టాండు, కుర్చీ..అన్నీ వెదికాడు....రాజా లేనేలేడు! 'పైకి పారిపోయేడా?' పారిపోవడమే జరిగితే చూచివుండేవాడే మరి—

పక్క వేడిగానేవుంది, అప్పుడే మనిషి పడుకుని లేచినట్టుగా—కొద్దిక్షణాల క్రితమే వెళ్ళి వుండాలి.

ఎదురుగా కిటికీ తెరచివుంది? ఎందుకు తెరవబడాలి? నాయనికి పాలుపోలేదు. కిటికీ దగ్గరగావెళ్లి క్రిందకి చూచాడు. క్రిందనే ఓ మనిషి, ఆకారం కుప్పకూలినట్టుగా రాళ్ళమీద వుంది. 'రాజా?' నోట్లోనే అణగిపోయేయి మాటలు.

పిస్తోలు లోపలపెట్టుకునే, ప్రక్కగా వున్న నీటిగొట్టంమీదుగా క్రిందికి దిగేడు. ఆ ఆకారం వైపు వంగేడు. అది రాజాదే! తలక్రిందుగా, రక్తంమడుగులో, వికృతంగా పడివున్నాడు. అది నాయనిని భయంలో ముంచింది.

చచ్చిపోయాడా? నెమ్మదిగా చెయ్యిచొక్కా లోపలకి త్రోసిచూస్తే గుండె ఆగిపోయింది. ఆ క్షణంలో తెలియకపోయినా, ఆ కళ్ళల్లోని రక్తం, తడిసిన ఒళ్ళు... చచ్చేడు అన్నందుకు, మేం సాక్ష్యం అని క్రూరంగా చెప్పాయి.

నాయనిని భయం ఆవరించింది. ఏమనిషైతే చంపదలచుకున్నాడో, అతడే, క్రూరంగా చచ్చివుండిపోయేడు. మృత్యువు అన్నది ఇంత భీకరంగా వుంటుంది అంటే దేవుడు ఇచ్చిన జీవాన్ని చంపుటకు ఇంకో జీవికి అధికారం ఎక్కడవుందో అనిపించింది.

సుబ్బన్న 'వాడిబ్రతుకే అంత...అల్లాగే జీవిస్తాడు' అన్నవాక్యం జ్ఞాపకం వచ్చింది. ఈ చావులో కూడా ఆ విషపు ముఖంలో శాంతత వుందన్నట్టే తట్టింది. సుబ్బన్న ముక్కల్లో అర్థం? తను అతన్ని చంపడానికే వచ్చేడు. ఇప్పుడు—

నాయని భయంతో పరిగెత్తేడు. తోట దగ్గరకు వచ్చేసరికి జోళ్లు జ్ఞాపకంవచ్చేయి. నెమ్మదిగా తిరిగి వెళ్లి జోళ్ళు తొడుక్కున్నాడు. కిటికీ ఇదివరకు చూచిన స్థితిలోనే అనుమానం కలగకుండా ఉంచి తోటకు అడ్డపడ్డాడు. కాలవగట్టుకి వచ్చేసరికి పరుగే.

ఓ వందగజాల్లో ఇల్లు వుందనగానే. ఎదురుగా వస్తూన్న వెంకన్నకు డీకొన్నాడు... వెంకన్న నాయనిం జూచి 'చాలా రాత్రి అయ్యిందే', అని పలకరించి వెళ్లేడు; ప్రక్కవూరు సినీమా నుండి వస్తూ.

ఈ వెంకన్నని కలియడం దురదృష్టం అనుకుని తిట్టుకుని, ఏదో జవాబు గొణిగేడు. కాని, అతనే రేపు ఇం రాత్రివేళ చూచేను అని సాక్ష్యం ఇస్తే, బుకాయించెయ్యగలను అన్న ధైర్యంవుంది. నిజంగా వెంకన్న గుర్తించేడా? ఎప్పుడూ పలకరించనైనా లేదే! అనుమానంలో గుమ్మం తలుపుకి తల కొట్టుకొన్నాడు. ఖంగారుగా పడకగదికి వచ్చి, బ్రాందీ సీసా నోటికి ఎత్తేడు.

రాత్రంతా-రాజా ఎల్లా చనిపోయాడు? తనే రాజాని కిటికీలోనుండి క్రిందకు తోసేనని అనుమానపడతారా? ఆలోచనలు—వేగుచుక్క పొడిచేవరకూ ఆలోచనలే.

* * *

రెండు రాత్రులు గడిచేయి. అవి కాళరాత్రులే అయ్యేయి నాయనికి. మానసిక ఆందోళనలో, ప్రతీచిన్న విషయమూ భయపెట్టింది. ఆ నలుబది

ఎనిమిది ఘంటల్లో ముదుసలి చిహ్నాలు అతన్ని ఆవరించేయి.

సుబ్బన్నని ప్రశ్నలు వెయ్యాలనుకున్నాడు. ఏం జరిగింది? ఏ మనుకుంటున్నారు? అని. సుబ్బన్న దగ్గరికి వచ్చినపుడు చూచే చూపుల పదును ఆగలేకపోతున్నాడు. హృదయంలోప లికి గుచ్చేట్టు చూస్తాడు సుబ్బన్న.

ఆ రెండో రోజు సాయంత్రమే, పక్కలు వేస్తున్న సుబ్బన్నను, శ్రద్ధలేనట్టుగా, యాదా లాపంగా—

'రాజావారి విషయం ఏమైంది? ఏమైనా విన్నావా?'

'వెంకన్న చెప్పేడండి.' తెల్లబోయేడు నాయని. సుబ్బన్న తనవైపు చూడకుండావుండా లని వెనక్కి తిరిగేడు.

'ఆ రాత్రివేళ మిమ్మల్ని కందిచేలదగ్గర చూచేనన్నడండి.'

'నన్నా! పొరపడ్డాడేమో! ఆసాయంత్రం అసలు నేను ఇల్లువదలలేదే. నాలానే ఉండే ఇంకొకళ్ళని ఎవరినైనా చూచేడేమో!' ఆగేడు. తనలోవుండే ఖంగారు తనకి తలవంపు చేస్తోంది. ఎంత ఆదరా బాదరా పడుతున్నాడో తట్టింది.

'అనవసరమైన గాలివార్తలు పుట్టించవద్దని వెంకన్నతో చెప్పు. లేకపోతే నేనే వెంకన్నని-'

'అందరితోటి అప్పుడే చెప్పేసేడండి'

ఉద్వేగంను కుక్కుకోలేక బాధపడ్డాడు. జీవితంలో మొట్టమొదటిసారి యుద్ధంలోకి వెళ్ళ వలసినసమయం జ్ఞాపకం వచ్చింది. ఆరోజు ఆరాటం చిమ్మింది ఇప్పుడూ.

'స్కూలుచుట్టూరా వున్న వాళ్ళందరూ ఎరు గుదురు. హెడ్ కాన్‌స్టేబిల్ గురవయ్యకూ తెలుసు. పైగా సర్కిల్, డి. యస్. పి ఇవ్వాళ కారులో వస్తారుటండి'

'రాజా ఎల్లా చచ్చేడో వీళ్ళకు అనుమానం లేదా!'

'నేను వినలేదండి'

'అయితే జానీనిగురించి రాజాకి మనకి ఉండే దెబ్బలాట వాళ్ళకు తెలుసా?'

'నన్ను ఎవరూ ఏం అడగలేదండి ఇంత వరకూ'

'అయితే నువ్వు అడిగితే చెప్పకేం. వింటే నన్నుకూడా అందులో కలుపుతారు' యాదా లాపంగా అనాలంటే రాలేదు.

తెల్లబోయేడు సుబ్బన్న. 'ఇంతవరకూ అబద్ధం చెప్పలేదండి. దేవుడు శిక్షిస్తాడండి. అడి గితే చెప్పకుండా ఎల్లా వుంటాను'

కుర్చీలోనుండి లేచి, నాయని చిరాకుగా ఇటూ అటూ పచారుచేసేడు. సుబ్బన్న తత్వం భీకరంగా ఉచ్చులు వేస్తున్నట్టువుంది. 'అయితే నేను రాజాని ఖూనీచేసేనని నువ్వు నమ్ము తున్నావా?'

అచేతనంగా ఉండి, నెమ్మదిగా 'మీరు ఏం చెప్పలేదే' అన్నాడు సుబ్బన్న.

'నేనుచెయ్యలేదు. విన్నావా సుబ్బన్నా. నాకు తెలియదు. నేను నిజంగా అతన్ని చంపా లనే అక్కడకి వెళ్ళే; ఉత్తరంచూచిన తర్వాత. కాని చచ్చే అక్కడ అతను ఉన్నాడు. కిటికీ క్రిందుగా. సుబ్బన్నా, నన్ను నమ్ముతావా?'

హృదయం తేలిక పడినట్టు అయ్యింది సుబ్బ న్నకి. 'మీరు ఎప్పుడూ నాతో అబద్ధం చెప్ప లేదు. నేను నమ్ముతా. మొట్టమొదట అనుకున్నా-'

తలూపేడు నాయని.

'చంపడం అన్నది ఎంత క్రూరంగా శిక్షి స్తుందో మీరుచూచేరా! మీదుర్మార్గానికి శిక్ష అనుభవించేరుకా.'

'శిక్షా!'

'మీమనస్సు మిమ్మల్ని కాల్చేయలేదూ? అదే!'

'సుబ్బన్నా! ఎవరైనా ప్రశ్నిస్తే చెప్పకూ- జానీసంగతి, నేనువెళ్ళడం అదీని. ఇంతకంటె చిన్నచిన్న విషయాలకే మనుష్యుల్ని ప్రభుత్వం ఉరితీసింది.అయినా నేను ఖూనీ చెయ్యనేలేదు.'

సుబ్బన్న వెళ్ళడం నాయనికి కొద్దితేలిక నిచ్చింది. అతను చెప్పిన శిక్ష సమంజసంగానే ఉంది. తను ఓవిధంగా దోషే! మానసికంగా రాజాని ఖూనీ చేసేడు. అయినా అది క్రియలో లోపించింది. దీనికి ప్రభుత్వంన్ను శిక్షిస్తుందా?

వాళ్లు తను రాజాగదిలోకి వెళ్లేనని గుర్తి స్తారా? తనకి ఉరిశిక్ష విధిస్తారా! సుబ్బన్న చెప్పకుండా ఉంటాడా? సందేహాలు

పిచ్చివానిగా చేసేయి. ఆ రాత్రి నిద్రరానే లేదు. ఊహాల్లో జరిగిన కాలంలో విన్న, శిక్షింపబడిన, ఖూనీలు, వాటి పరిణామాలు జ్ఞాపకం వచ్చేయి.

తెల్లవారుజామునే కన్ను మూగన్ను అయ్యింది. ఉలిక్కిపడి క్రింద చప్పుడు విని లేచేడు. కలలో తనకి నల్ల గుడ్డలు కట్టినట్టు, ఉరి త్రాడు తగిలించినట్టు కలలు గన్నాడు.

* * *

మేడ మెట్లు ఎక్కుతున్నాడు. సుబ్బన్న తలుపు దగ్గరగా వచ్చి,'బాబుగారూ! డి.యస్.పి. సుదర్శన్ వచ్చేరండి' అన్నాడు.

జరగవలసిందే జరిగిందన్న మాట. లేచేడు ఉలిక్కిపడి. 'సావిట్లో కూర్చోపెట్టు' హృదయ స్పందనం ఎక్కువై మాట తడబడింది. తను ఎంత క్రూరంగా ఇరుక్కున్నాడో !

చొక్కా తొడుక్కుని, మెట్లు దిగుతూ క్రిందికి చూచేడు. కొంజాలో పోలీసులు నుంచుని మాట్లాడుకుంటున్నారు. శరీరం వణికింది. ఓసారి గదంతా ఆఖరుసారి అన్నట్టు చూచుకుని దిగేడు.

నమస్కారాలు అయిన తర్వాత, ఎర్రగా, పొడుగ్గా బే డ్రస్సులో వున్న అధికారి సుదర్శన్ 'నేను, మీ పొరుగు రాజావారి మృతి సంబంధంలో వచ్చేను.'

తలూపేడు నాయని.

'మీరిద్దరూ స్నేహితులనుకుంటాను'

'అంత ఎక్కువగా కాదు. ఆయన తెలుసును'

'ఆఖరు సారిగా ఆయన్ని ఎప్పుడు మీరు చూసేరు?'

'ఆయన్నా- ఓ పక్షం దినాలక్రితం అనుకుంటా'

'అయితే మీ యిద్దరికీ ఎక్కువ జోస్తీ లేదా?

నాయనకి అబద్ధాల్లో పెనిమి వణికింది. దాన్ని నొక్కిపట్టినా కదులుతున్నట్టే ఉంది. 'ఆయనకి నేను ఎప్పుడూ స్నేహితుణ్ణి కానండి. ఎప్పుడు అతనితో స్నేహం కలుపుకోవాలని నాకు ఉండేదికాదు. ఒక్కటి- ఆయన నాకు పడోసీ అంతే!'

సుదర్శన్ నవ్వేడు. నాయనికి గుండెలు బేజారయ్యేయి.

'అయితే ఆ చనిపోయే రోజున రాజావారు మీకు ఉత్తరం వ్రాసేరు నిజమేనా?'

ఉలిక్కిపడ్డాడు నాయని. ఎవరో ఉత్తరం తీసుకువచ్చినవారు చెప్పివుంటారనుకున్నాడు.

'జౌను. అది, అదైనా చిన్న ఉత్తరం. నిజం చెప్పాలంటే చాలా చిన్నదే.'

సుదర్శన్ తలూపుతూ 'దాన్ని మీరు చింపేసేరా?'

'జౌను' ఈ ప్రశ్న వెయ్యడానికి ఎక్కడ చిల్లుపెడుతున్నాడో అర్థంకాలేదు నాయనికి. ఆశ్చర్యం కల్గింది.

'రాజావారు మీ కుక్కని చంపినట్టున్నారు. దానికి మీరు చాలా ద్వేషించినారు కాబోలు'

కళ్ళుప్పగించే 'ఉ' అన్నాడు. లోపల్లోపల సుబ్బన్న రహస్యం వెల్లడి చెయ్యకుండా ఉన్నాడా? దేవుడు తనకి ఆ విషయంలో సహాయం చెయ్యాలని ప్రార్థించేడు.

జేబులోనుండి కాగితం ఒకటి తీసి మడత విప్పుతూ 'చూచేరా నాయనింగారు' ఆ ఉత్తరానికి నకలు ఇది. అద్దు కాగితంమీద ఉంది' చూపించేడు.

అది చూచి నాయని ఏదైనా చెప్పాలనుకున్నాడు. ముఖంలో రక్తం తెల్లబడిపోయి మాట్లాడలేక భయంలో చిన్నశబ్దం మాత్రం చేశాడు. సుదర్శన్ నవ్వేడు. ఇది 'ఇంకా ఈతనికి ఎంత తెలుసు ' అన్న ఆందోళన కల్గించి, నాయనిని అచేతనుణ్ణి చేసింది.

'నాయనింగారూ! మీరు ఒక్క ప్రశ్నకి సమాధానం చెప్పాలి. ఒక్కటే నన్ను అర్థంగాని ఆశ్చర్యంలో ముంచుతోంది. దానికి మీరు చెప్పగలరనుకుంటున్నా. అయితే మీరు ఆరాత్రి రాజావారి గదిలో ఏంచేసేరో చెప్తారా?' సుదర్శన్ కళ్లు నాయని కళ్ళని గుచ్చినట్టు చూచేయి.

'అది పచ్చిఅబద్ధం, క్రూరమైన అనుమానం. నే నెప్పుడూ రాజావారి ఇంటి-' నాయని నిలదొక్కుకో లేకపోయేడు.

'అయితే నాయనింగారు, మీరు మర్చిపోయారేమో! ఆ సాయంత్రం మీ తుపాకీతో కాలవగట్టువరకూ వెళ్ళేరు. అది ఆయన వ్రాసిన ఉత్తరమే సాక్ష్యం చెప్తోంది.

పైగా మీ సుబ్బన్న రాజావారికి అపాయం గురించి చెప్పడానికి అక్కడకి వచ్చేడని వాళ్ళ నౌకరు చెప్పేడు'

నాయని చేతులు అచేతనంగా పీకమీదకు వెళ్ళేయి. పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయింది. ఊపిరి తీసుకోడానికి భయం అయి, ఒళ్ళంతా చెమటలు పోసేయి.

'ఆ సాయంత్రం రాజావారి ఉత్తరం మీకు వచ్చింది. తర్వాత మీరు మీ ఇల్లు వదిలేరు. పొలాలకి అడ్డు పడి, రాజావారి ఇంటికి వచ్చి, కిటికీలోనుండి లోపలికి ప్రవేశించేరు. మీ జోళ్ళ ఆనవాళ్ళు ఉండనే ఉన్నాయి. గుమ్మం దగ్గరే జోళ్ళను విడిచి, పడక గదిలోకి వెళ్ళేరు. లోపలికి వెళ్ళేటప్పుడే మీరు తలుపుమీద గట్టిగా గీచేరు. అది మీ రివాల్వరుతో అయి వుంటుంది. నీటి గొట్టంమీద, పక్క దుప్పటిమీద, బురద చేతి ముద్దరలు అంటేయి. పైగా రాజావారి చొక్కామీద కూడాను.

'ఆయన పక్కమీద లేడు. పక్క ఖాళీగానే ఉంది. కిటికీలోనుండి ఇదివరకే క్రిందపడి వున్నాడు. నేను భగవంతుని సాక్షిగా చెపుతున్నా' కుర్చీలోనుండి లేచి గట్టిగా అరిచేడు.

'ఖంగారు పడకండి. నెమ్మది. రాజావారు పక్కమీద ఉండగానే మీరు గుండెల్ని చూచేరనటం లేదు. ఆయన ఎల్లా చచ్చేరో మాకు తెలుసు.'

'మీకు తెలుసా?' నిజంగా అది ఓ పెద్ద షాలికేకే.

ఆ కిటికీ పరిసరాలుగల ఫొటోని తీస్తూ 'చూచేరు, గోడకు అంటించిన రంగుకాగితం ముక్కల లోపమే మమ్మల్ని కారణం గ్రహించేట్లు చేసింది. వాళ్ళనౌకరు చెప్పేడు- అప్పుడప్పుడు రాజావారు ఊపిరి తీసుకునే విషయంలో బాధపడేవారని. చూచేరా, ఆచిన్న చిన్న రక్తపు చుక్కలు అవి ముక్కులోనుండి పడ్డవే. ఊపిరితీయడం కష్టం అయ్యింది కనుకనే. పక్కనుండి లేచి, కిటికీ తెరచేరు; గాలి వస్తుందని. పైగా ఆరాత్రి ఎక్కువగా త్రాగి ఉన్నారేమో తూలడంవల్ల క్రింద పడిపోయేరు.'

'అయితే, నన్ను అనుమానించటం లేదు అన్నమాట' నాయనిమాటలు, కాళ్లుచేతులు కట్టి వదలినవాడి కదలికలాగే, ఒక్కుమ్మడి వచ్చేయి.

'మిమ్మల్నా- ఖూనీకా- లేదు. అయినామీరు నిజం చెప్పండి. మనం అందరంకూడా-'

'నిజంగా నేను ఆతన్ని' గొంతులోనుండి వచ్చింది.

'చంపాలనే వెళ్లేరు' సుదర్శన్ అందించేడు. నాయని తలూపి, కుర్చీకి ఆనుకుపోయేడు.

'శ్రమకి కృతజ్ఞత. దాన్నిగురించి మీరు ఇక వినరు-చెప్పి,మననం చేసుకోకండి. నా అభిప్రాయంలో ఖూనీచెయ్యాలన్న అభిప్రాయమే చాలు, చేసినవంత ఫలమూ ఇస్తుంది. నిజంగా మిమ్మల్నిచూస్తే, మీరెంత బాధపడ్డారో తెలుస్తోంది.' సుదర్శన్ సెలవుపుచ్చుకుని వెళ్లేడు.

కుర్చీలో 'వెంకటేశ్వరస్వామి! నమస్కారాలు' అంటూనే కుప్పకూలిపోయేడు, దివాన్ బహదర్ నరిసింగ నాయనింగారు.

(కోబాల్డునైట్ వ్రాసినకథ ఆధారం)

ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:



1907)

జారీచేసి చందావేయబడిన

మూలధనం	రూ. 72,00,000
అడిగిన మూలధనం	రూ. 53,00,000
రిజర్వ్ ఫండ్	రూ. 62,00,000

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,
కార్యదర్శి.